రైతుల గోస తీరేదెప్పుడు..?

- కోటలో ఆరు నెలలు ఆసాములు, ఆరు నెలలు కూలీలు
- వరదకు శాశ్వత పరిష్కారం కోసం అన్నదాతల ఎదురుచూపు
- తూము మరమ్మతులను పట్టించుకోని పురావస్తు శాఖ అధికారులు

కోటలో చెరువును తలపిస్తున్న పంట పొలాలు

ఖిలావరంగల్, సెప్టెంబర్ 14: చారిత్రక ఖిల్లాలోని పంట పొలాలు చెరువును తలపిస్తున్నాయి. దీంతో ఏడాదిలో రైతులు ఆరు నెలలపాటు ఆసాములుగా, మరో ఆరు నెలలు మరోచోట కూలీలుగా పని చేస్తున్నారు. శాశ్వత పరిష్కారం కోసం అన్నదాతలు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నా ఫలితం లేదని వాపోతున్నారు. జల్లెడ తూము మరమ్మతులను చేపట్టాలని ఏటా రైతులు కేంద్ర పురావస్తు శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఖిలావరంగల్ రాతికోట ఉత్తర ద్వారం వద్ద సుమారు వంద ఎకరాల పంటలు ఏటా వర్షాకాలంలో నీటమునిగి చెరువును తలపిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం వరంగల్ మహానగర పాలక సంస్థ మధ్యకోటలోని వడ్లవాడ మీదుగా రాతి కోట జల్లెడ తూము వరకు బాక్స్ డ్రైనేజీ నిర్మించడమే. జల్లెడ తూము కుంగిపోయి చెత్తాచెదారంతో నిండింది. దీంతో వర్షపు నీరు భారీగా చేరుతోంది. అలాగే, ప్లాస్టిక్ వ్యర్థాలు, గ్రామీణ వైద్యులు ఉపయోగించిన సిరెంజ్‌లు, టానిక్ సీసాలు వర్షానికి కొట్టుకొచ్చి పంట పొలాలను కలుషితం చేస్తున్నాయి.

ఆకు కూర తోటలే జీవనాధారం

ఒక వైపు ప్లాస్టిక్ వర్థాలు, మరో వైపు వరద నీటితో పనులు చేసుకోకుండా గోస పడుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆకు కూర తోటలు సాగు చేస్తూ గౌరవంగా బతికే రైతులు ఏటా వర్షాకాలంలో మరోచోట కూలి పనికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. జల్లెడ తూము కేంద్ర పురావస్తు శాఖ పరిధిలో ఉంది. మరమ్మతు చేపట్టాలని ఆ శాఖ అధికారులకు విన్నవించినా రేపుమాపు అంటూ దాటవేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. జిల్లా అధికార యంత్రాంగం స్పందించి రెండు శాఖల సమన్వయంతో ముంపునకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

325 జీపీల్లో 3,88,903 మంది ఓటర్లు

■ పురుషులు 1,91,156 ■ జిల్లాలో మహిళా ఓటర్లే అధికం

ఖిలావరంగల్, సెప్టెంబర్ 14: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లా ముసాయిదా ప్రచురణ ఓటరు జాబితాను పంచాయతీ శాఖ శనివారం విడుదల చేసింది. పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. జిల్లాలో 325 జీపీలు, 2,828 వార్డుల్లో 3,88,903 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,91,156 మంది పురుషులు, 1,97,738 మంది మహిళలు, 9 మంది థర్డ్ జెండర్స్ ఉన్నారు.

మండలాల వారీగా వివరాలు

చెన్నారావుపేట 30 జీపీల్లోని 258 వార్డుల్లో 31,501 మంది ఓటర్లు, దుగ్గొండి 34 జీపీలోని 282 వార్డుల్లో 36,772, గీసుగొండ 21 జీపీల్లోని 188 వార్డుల్లో 28,331, ఖానాపురం 21 జీపీల్లోని 184 వార్డుల్లో 27,768, నల్లబెల్లి 29 జీపీల్లోని 252 వార్డుల్లో 30,931, నర్సంపేట 27 జీపీల్లోని 238 వార్డుల్లో 33,213, నెక్కొండ 39 జీపీల్లోని 340 వార్డుల్లో 45,636, పర్వతగిరి 33 జీపీల్లోని 288 వార్డుల్లో 39,142, రాయపర్తి 40 జీపీల్లోని 342 వార్డుల్లో 45,557, సంగెం 33 జీపీల్లోని 286 వార్డుల్లో 41,168, వర్ధన్నపేట మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలోని 170 వార్డుల్లో 28,884 మంది ఓటర్లు ఉన్నారు. అభ్యంతరాలుంటే ఈ నెల 21లోగా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని ఇన్‌చార్జి డీపీవో రాంరెడ్డి కోరారు.

క్రీడలతోనే ఒత్తిడి దూరం: ట్రస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

క్రీడాకారులను పరిచయం చేస్తున్న జోన్ అధ్యక్షుడు బొల్లం కనకయ్య

కాశీబుగ్గ, సెప్టెంబర్14: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, తద్వారా ఆరోగ్యవంతమైన జీవనం గడుపొచ్చని ట్రస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్‌రావు అన్నారు. ఓసిటీ స్టేడియంలో వడుప్సా (ట్రస్మా) వరంగల్ జోన్ స్థాయిలో క్రికెట్, క్యారమ్, చెస్ పోటీలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ నిత్యం ఒత్తిడితో ఉండే వారికి క్రీడలు ఉత్సాహాన్నిస్తాయనారు. కార్యక్రమంలో జోన్ అధ్యక్షుడు బొల్లం కనకయ్య, చల్లా నాగార్జునరెడ్డి, కొమ్మినేని భూపాలరావు, చంద్రారెడ్డి, రవి, జన్ను విలియం, సుధీర్, వెంకటేశ్వర్లు, రామ్మూర్తి, సూర్యనారాయణ, రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, సురేశ్, అశోక్ పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

ఖిలావరంగల్, సెప్టెంబర్ 14: గంజాయి విక్రయిస్తున్న ఒకరిని మిల్స్ కాలనీ పోలీసులు, యాంటీ డ్రగ్స్ టీం సంయుక్తంగా అరెస్టు చేసినట్లు మిల్స్‌కాలనీ సీఐ పీ మల్లయ్య తెలిపారు. ఖిలావరంగల్ పడమర కోటకు చెందిన ఆటో డ్రైవర్ పసునూటి నాగరాజు(32) సీలేరుకు వెళ్లి 2.100 కిలోల గంజాయిని కొనుగోలు చేసి ఇంటిలో భద్రపరిచాడు. విశ్వసనీయ సమాచారం మేరకు అతడి ఇంట్లో ఎస్సై ఎస్ రవీందర్‌తో పాటు పోలీసులు సోదాలు చేసి కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నాగరాజుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

'చెరువుల వద్ద భద్రతా ఏర్పాట్లు చేయాలి'

కాశీబుగ్గ, సెప్టెంబర్ 14: గ్రేటర్ వరంగల్ పరిధిలో గణేశ్ నిమజ్జనానికి చెరువుల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలని చెరువుల పరిరక్షణ సొసైటీ అధ్యక్షుడు పెరుమాండ్ల లక్ష్మణ్ వరంగల్ సీపీని కోరారు. కాశీబుగ్గలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాజీపేట, హనుమకొండ, వరంగల్‌లోని ముఖ్యమైన చెరువుల వద్ద ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్కౌట్స్, హోంగార్డ్సుతోపాటు పోలీసు అధికారులతో బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో సిలువేరు నగేశ్, పోతన వెంకటేశ్వర్లు, జన్ను థామస్, బత్తుల మల్లికార్జున్, బిర్రు నిరంజన్, బాస్కుల హరినారాయణ పాల్గొన్నారు.

నిమజ్జనానికి సహకరించాలి

రాయపర్తి, సెప్టెంబర్ 14: గణపతి నిమజ్జనానికి మండల ప్రజలు పోలీసులకు సహకరించాలని వర్ధన్నపేట సీఐ కొమ్మూరి శ్రీనివాస్‌రావు కోరారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై కొంగ శ్రవణ్‌కుమార్ సారథ్యంలో డీజే నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. శోభాయాత్రలో డీజేల వినియోగానికి అనుమతి లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలకు అనుగుణంగా ఉత్సవ కమిటీలు వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో ఏఎస్సై పళ్లకొండ సదానందం, సిబ్బంది జలగం ఏలియా, గుడికందుల రవీందర్, తూళ్ల సంపత్‌కుమార్, మద్దెల కుమారస్వామి, బానోత్ సుమన్‌నాయక్, రఫీ పాల్గొన్నారు.

బాల్య వివాహలను రూపుమాపాలి

గీసుగొండ, సెప్టెంబర్ 14: బాల్య వివాహలను రూపుమాపాలని, అప్పుడే సమాజంలో మహిళలపై దాడులు తగ్గుతాయని సఖీ సెంటర్ లీగల్ అడ్వికేట్ శోభారాణి అన్నారు. మచ్చాపురంలో శనివారం గ్రామైక్య సంఘాల సభ్యులతో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం అనేక చట్టాలు రూపొందించాయని, వాటిని వినియోగించుకోవాలని శోభారాణి సూచించారు.

చరిత్రను వక్రీకరిస్తున్న పాలకులు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

ఐలమ్మ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

నర్సంపేట/వరంగల్‌చౌరస్తా, సెప్టెంబర్ 14: సాయుధ పోరాట చరిత్రను పాలకులు వక్రీకరిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. సీపీఐ ఆధ్వర్యంలో నర్సంపేటలో శనివారం తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. విలీన దినోత్సవంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కపట నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. 17న విమోచన దినోత్సవం పేరిట బీజేపీ తలపెట్టిన కార్యక్రమాలు ప్రజలను మభ్యపెట్టేలా ఉన్నాయన్నారు. తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని, ట్యాంక్‌బండ్‌పై సాయుధ పోరాట యోధుల విగ్రహాలు పెడతామని, పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను చేర్చుతామని చెప్పిన ప్రభుత్వం హామీలను ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవం జరుపుతామని రాష్ట్ర ప్రభుత్వం అనడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేశ్, షేక్ బాషమియా, పనాస ప్రసాద్, అక్కపల్లి రమేశ్, కందిక చెన్నకేశవులు, గన్నారపు రమేశ్, గోవర్ధనాచారి, దామెర కృష్ణ, పాలక కవిత, ఇల్లందుల సాంబయ్య, పార్థసారథి, ఐతా యాకూబ్, గడ్డం నాగరాజు పాల్గొన్నారు. వరంగల్ ఓంకార్ భవన్‌లో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరులను స్మరించుకున్నారు. అనంతరం ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ మాట్లాడుతూ చరిత్రలో లిఖించదగ్గ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి, జిల్లా సహాయ కార్యదర్శి నర్రా ప్రతాప్, మహిళా విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగల రాగసుధ, జిల్లా నాయకులు ఐతం నగేశ్, ఎగ్గెని మల్లికార్జున్, మాలి ప్రభాకర్, నగర నాయకులు గోవర్ధన్, రాజు, నర్సయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

ఇంటర్ విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్

మాట్లాడుతున్న ఇంటర్ విద్యాధికారి శ్రీధర్ సుమన్

వర్ధన్నపేట, సెప్టెంబర్ 14: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఇంటర్ జిల్లా విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నూతన విద్యార్థుల స్వాగత కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. నిరుపేద కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు కూడా వారి పిల్లలను ఏటా లక్షల రూపాయలు ఖర్చు చేస్తూ ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో విద్యను అందిస్తున్నారన్నారు. దీనివల్ల పేద కుటుంబాలు మరింత ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. ప్రైవేటు కాలేజీల కంటే ప్రభుత్వ కళాశాలల్లోనే అన్ని అర్హతలు, అనుభవం ఉన్న అధ్యాపకులతో విద్యాబోధన అందిస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు ఆలోచించి తమ పిల్లలను ప్రభుత్వ కాలేజీల్లో చేర్పించాలని కోరారు. అనంతరం ఇటీవల బదిలీపై వెళ్లిన అధ్యాపకులను విద్యార్థులు, అధ్యాపకులు సత్కరించారు. అలాగే, ఫ్రెషర్స్‌డే సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటయ్య పాల్గొన్నారు.

శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలి

వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్

సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ నందిరాం

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 14: వరంగల్ నగరంలో వినాయక నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీని శాంతియుతంగా జరుపుకోవాలని వరంగల్ ఏసీపీ నందిరానాయక్ కోరారు. ఈ నెల 16న ఒకేరోజు వినాయక నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ ఉన్నందున సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు సెంట్రల్ డీసీపీ షేక్ సలీమా పర్యవేక్షణలో వరంగల్ ఎల్‌బీనగర్‌లోని క్రిస్టల్ గార్డెన్‌లో ముస్లిం మత పెద్దలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఒకే రోజు రెండు మతాల పండుగలు ఉన్నందున ఊరేగింపును వాయిదా వేసుకోవాలని కోరగా, ముస్లింలు అంగీకరించి ఈ నెల 19న ఊరేగింపు నిర్వహించుకునేందుకు నిర్ణయించారని తెలిపారు. 16న జరిగే వినాయక నిమజ్జనానికి అందరి సహకారం అవసరమన్నారు. అలాగే, 19న జరగనున్న మిలాద్ ఉన్ నబీకి పోలీసుల సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. సమావేశంలో కార్పొరేటర్ ఎండీ పుర్ఖాన్, నాయకులు అయూబ్, ఎంఏ సుభాన్, సాదిక్ అబ్దుల్లా, యాకూబ్ పాషా, ఫక్రుద్దీన్, ఏజాజ్, ఖుర్షీద్ సైపుద్దీన్, సీఐలు తుమ్మ గోపి, మచ్చ శివకుమార్, మల్లయ్య, ఎస్సై వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్లకు ఐదుగురు టీచర్లు

గిర్మాజీపేట, సెప్టెంబర్ 14: జిల్లాలోని మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులు వేరే జిల్లాలకు బదిలీపై వెళ్లారు. అలాగే, ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు ఐదుగురు బదిలీపై వచ్చి విధుల్లో చేరినట్లు డీఈవో జ్ఞానేశ్వర్ శనివారం తెలిపారు. పీజీసీఆర్‌టీ ఇంగ్లిష్ జనగామ నుంచి సంగెం, సీఆర్‌టీ ఇంగ్లిష్ భూపాలపల్లి నుంచి ఖానాపురం, సీఆర్‌టీ మ్యాథ్స్ జనగామ నుంచి పర్వతగిరి, సీఆర్‌టీ సోషల్ ములుగు నుంచి చెన్నారావుపేట, పీఈటీ గూడూరు నుంచి ఖానాపురానికి బదిలీపై వచ్చినట్లు డీఈవో వెల్లడించారు.

టీచర్ల సమస్యల పరిష్కారాకి కృషి

వర్ధన్నపేట/పర్వతగిరి, సెప్టెంబర్ 14: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీఎస్ పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అలాగే, పీఆర్టీయూ టీఎస్ పర్వతగిరి మండల కమిటీని ఉపాధ్యాయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అవార్డు అందుకుంటున్న కోడం శ్రీధర్

కోడం శ్రీధర్‌కు అవార్డు

కరీమాబాద్, సెప్టెంబర్ 14: ఆలిండియా ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ న్యూ ఢిల్లీ, డిజిటల్ శాటిలైట్ స్కూల్స్ హైదరాబాద్ వారు శనివారం న్యూ కౌటిల్యాస్(ఎస్ఏ) పాఠశాల ప్రిన్సిపాల్ కోడం శ్రీధర్‌కు ట్రస్మా రాష్ట్ర నాయకుల చేతులమీదుగా బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ తనకు అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. ఈ సందర్భంగా ట్రస్మా నాయకులు శ్రీధర్‌ను అభినందించారు.

24న బల్దియా సర్వసభ్య సమావేశం

వరంగల్, సెప్టెంబర్ 14 : వరంగల్ మహా నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం ఈ నెల 24న నిర్వహించనున్నారు. రెండు రోజులుగా బల్దియా సర్వసభ్య సమావేశంపై మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కసరత్తు చేశారు. పాలక మండలి ఆమోదం కోసం 15 ఆర్థిక సంఘం నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఎజెండాలో చేర్చనున్నారు.

ఎంజీఎంలో రక్తదాన శిబిరం

వరంగల్‌చౌరస్తా, సెప్టెంబర్ 14: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని రక్తదాత తోట రాజేశ్వర్‌రావు ఆర్య పిలుపునిచ్చారు. ఎంజీఎం బ్లడ్‌బ్యాంక్ ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన రక్తదానం చేయడంతో పాటు మరో 28 మందితో చేయించారు. ప్రతి ఒక్కరూ 55 ఏళ్ల వయస్సు వచ్చే వరకూ రక్తదానం చేయొచ్చన్నారు. రక్తదానం చేసిన వారికి ఎంజీఎం బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆశాదేవి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

గిర్మాజీపేట: అన్నం వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్

విఘ్నేశ్వరుడికి నన్నపునేని పూజలు

కరీమాబాద్/గిర్మాజీపేట/నర్సంపేటరూరల్, సెప్టెంబర్ 14: అండర్ రైల్వేగేట్ ప్రాంతంలో శనివారం వినాయకుడికి తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. అలాగే, గిర్మాజీపేట బొడ్రాయి వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడికి పూజలు చేసి అన్నదానం చేశారు. నర్సంపేట మండలంలోని ముత్తోజిపేటలో ఎండీ రియాజ్ 216 కిలోల లడ్డూను తయారు చేయించి ట్రాక్టర్‌లో ఊరేగింపుగా తీసుకొచ్చి వినాయకుడికి అందించారు.

పేకాట స్థావరంపై దాడి.. ఆరుగురి అరెస్ట్

గిర్మాజీపేట, సెప్టెంబర్ 14: పేకాట స్థావరంపై శుక్రవారం అర్ధరాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 31,860 నగదు, ఆరు స్మార్ట్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ మధుసూదన్ తెలిపారు. వరంగల్ అబ్బాస్ ఫంక్షన్ హాల్ ఏరియాలో ఉన్న బాబా రియల్ ఎస్టేట్ ఆఫీస్‌లో పేకాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు దాడులు నిర్వహించి ఎండీ అబ్దుల్ మోయిజ్, సయ్యద్ అబిద్, సయ్యద్ వహిద్, షేక్ నలైబాయి, ఎండీ మున్నా, సయ్యద్ జావేద్‌ను పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి విచారణ కోసం ఇంతెజార్‌గంజ్ పోలీసులకు అప్పగించినట్లు ఏసీపీ వివరించారు. ఆయన వెంట ఎల్ పవన్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

ఎమ్మార్సీని తనిఖీ చేసిన డీఈవో

హాజరు పట్టికను పరిశీలిస్తున్న డీఈవో

నర్సంపేటరూరల్, సెప్టెంబర్ 14: నర్సంపేటలోని ఎమ్మార్సీ కార్యాలయాన్ని డీఈవో మామిడి జ్ఞానేశ్వర్ శనివాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఐఎస్ ఒక్కరే హాజరు కాగా, కంప్యూటర్ ఆపరేటర్, మెసెంజర్ గైర్హాజరు కావడంతో డీఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఈవో పలు రికార్డులు, హాజరు పట్టికలను పరిశీలించారు. గైర్హాజరైన కాంట్రాక్ట్ ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని డీఈవో హెచ్చరించారు.

'అధిక సాంద్రత' పత్తి సాగు చేయాలి

నర్సంపేటరూరల్, సెప్టెంబర్ 14: రైతులు అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేసి అధిక దిగుబడి సాధించాలని ఏవో కృష్ణకుమార్ అన్నారు. మహేశ్వరంలో అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేసిన పత్తి పంటను శనివారం ఆయన పరిశీలించారు. అధిక సాంద్రత పద్ధతిలో ఎకరానికి 25 వేల మొక్కలు నాటొచ్చని, 20 నుంచి 25 క్వింటాళ్ల పత్తి దిగుబడి సాధిస్తారన్నారు.

కేజీబీవీ ప్రత్యేకాధికారికి పురస్కారం

సంగెం, సెప్టెంబర్ 14: విద్యాశాఖలో విశిష్ట సేవలు అందిస్తున్న సంగెం కేజీబీవీ ప్రత్యేకాధికారి నీలిమాకు ఆచార్యదేవోభవ జాతీయ పురస్కారం లభించింది. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని యువతేజం ట్రస్టు కలాం విజన్ ఆధ్వర్యంలో తిరుపతిలో శనివారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలిమా సేవలను గుర్తించి ఆమెకు ఈ అవార్డును అందజేశారు. నీలిమాను అధికారులు, ఉపాధ్యాయులు, నాయకులు అభినందించారు.

చిన్నారి కార్తీకకు పూర్వ విద్యార్థుల సాయం

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 14: వరంగల్ దేశాయిపేటకు చెందిన ఇజ్జగిరి కార్తీక ఆరోగ్య పరిస్థితిపై నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి నాగార్జున పాఠశాల పూర్వ విద్యార్థులు (2002 టెన్త్ బ్యాచ్) చలించారు. ఈ మేరకు పూర్వ విద్యార్థులైన హరీశ, శరత్ తోటి స్నేహితుల నుంచి రూ. 25,000 విరాళాలు సేకరించి శనివారం నాగార్జున సహాయ చారిటబుల్ క్లబ్‌కు అందజేశారు. స్కూల్ కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు వారిని అభినందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఖానాపురం, సెప్టెంబర్ 14: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రఘుపతి అన్నారు. దబీర్‌పేటలోని జడ్పీహెచ్ఎస్‌లో శనివారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్లకు వచ్చే అపరిచిత మెసేజ్‌లను ఓపెన్ చేయొద్దని, అనవసరమైన యాప్‌లను డౌన్‌లోడ్ చేయొద్దన్నారు. సైబర్ నేరాలు జరిగిన వెంటనే పోలీసులను ఆశ్రయించాలన్నారు.

'వెంటనే కుల గణన చేపట్టాలి'

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 14: రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయకుండా వెంటనే కుల గణన చేపట్టాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పు మేరకు బీసీ కులాలతోపాటు అన్ని కులాల జనాభా లెక్కలను సమగ్రంగా తేల్చాలని కోరారు. దీని ద్వారా సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అన్ని కులాలకు సమన్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

నీటమునిగిన ఎడ్లబండి

నీటిలో మునిగి ఉన్న ఎడ్లబండి

సంగెం, సెప్టెంబర్ 14: ఎడ్లబండి నీటమునిగిన ఘటన శనివారం సాయంత్రం మండలంలో జరిగింది. మొండ్రాయికి చెందిన పొన్నాల మల్లయ్య ఉదయం ఎరువు బస్తాలను ఎడ్లబండిలో వేసుకొని పొలం వద్దకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి వస్తుండగా రోడ్డు సరిగా లేక ఎడ్లబండి చెరువులో పడిపోయింది. మల్లయ్య అప్రమత్తమై ఒడ్డుకు చేరాడు. బ్రిడ్జి నిర్మాణం కోసం రోడ్డు తవ్వి వదిలేశారని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఘనంగా హిందీ దివస్

- జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో వేడుకలు
- విద్యార్థులకు పలు రకాల పోటీలు
- ప్రతిభ చూపిన వారికి బహుమతుల ప్రదానం
- హిందీ ప్రాధాన్యాన్ని వివరించిన టీచర్లు

నర్సంపేటరూరల్: భాంజీపేట హైస్కూల్‌లో హిందీ ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

నర్సంపేటరూరల్/ఖిలావరంగల్/గీసుగొండ/రాయపర్తి/చెన్నారవుపేట/పోచమ్మమైదాన్/పర్వతగిరి, సెప్టెంబర్ 14: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం హిందీ దివస్‌ను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ప్రార్థనా గేయాలను హిందీలో ఆలపించారు. హిందీ టీచర్లు విద్యార్థులకు హిందీలో సందేశాలు ఇచ్చారు. నర్సంపేట మండలంలోని గురిజాల జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు హిందీలో ప్రతిభ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రాంచందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే, భాంజీపేట జడ్పీహెచ్ఎస్, లక్నేపల్లిలోని బాలాజీ టెక్నో స్కూల్‌లో వేడుకలు జరిగాయి. వరంగల్ 17వ డివిజన్ స్తంభంపల్లిలోని జడ్పీహెచ్ఎస్‌లో హిందీ పండింట్ గుండు రమేశ్ విద్యార్థులతో చార్టులు తయారు చేయించారు. హిందీ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రాజు, రమాదేవి, రమేశ్ పాల్గొన్నారు. గీసుగొండ మండలంలోని ఎలుకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్ర లేఖనం, ఉపాన్యాసం, నృత్యాలు, కవితలు, కృతమేళలు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయుడు కిశోర్, టీచర్లు కిరణ్మయి, విజయలక్ష్మి, శ్రీనివాస్, రమేశ్, కిషన్, అలిసమ్మ పాల్గొన్నారు. రాయపర్తిలోని ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం గారె కృష్ణమూర్తి ఆధ్వర్యంలో హిందీ దివస్ నిర్వహించారు. భారత దేశ ఔన్నత్యానికి ప్రతీకగా నిలిచే భిన్నత్వంలో ఏకత్వానికి జాతీయ భాష హిందీ ఎంతగానో దోహదం చేస్తుందని ఆయన అన్నారు. విద్యార్థులకు చిత్రలేఖనం, హిందీ పద్యాలు, వచనాల పఠనం, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. అనంతరం హిందీ పండిట్ గుగులోత్ సునీతను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీవీరభద్రశర్మ, గాదె ప్రవీణ్‌రెడ్డి, రోజారాణి, రాధ, పెదగాని సురేందర్, పీడీ శ్రీనివాస్, కలకోట్ల ప్రభాకర్, కోల దేవేందర్ పాల్గొన్నారు. చెన్నారావుపేట మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. జల్లి ప్రభుత్వ పాఠశాల, మండలకేంద్రంలోని సిద్ధార్థ గురుకుల పాఠశాలలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రభాకర్‌రావు, హిందీ టీచర్ బండారు భిక్షపతి, రమేశ్ పాల్గొన్నారు. వరంగల్ కొత్తవాడలోని ప్రభుత్వ ఉన్నత గిర్మాజీపేట పాఠశాలలో హెచ్ఎం నాగమణి ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు దుర్గం రవి, భాస్కర్, రాజు, అఫ్సర్, సంపత్‌కుమార్, రమాదేవి, శకుంతలాదేవి, ఉమాదేవి, కృష్ణ, సురేశ్ పాల్గొన్నారు. హిందీలో వ్యాఖ్యాతగా వ్యవహరించిన 9వ తరగతి విద్యార్థినులు కీర్తన, దివ్య ఆకట్టుకున్నారు. అలాగే, వరంగల్ ఎల్‌బీనగర్‌లోని ప్రభుత్వ చార్‌బౌళి ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎర్రబెల్లి నర్సింగరావు ఆధ్వర్యంలో పోటీలు ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు రఫీ, రత్నాకర్‌రావు, రమేశ్ పాల్గొన్నారు. పర్వతగిరిలోని ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పాక రమేశ్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపన్యాస, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హిందీ టీచర్లు ఎల్.రజిత, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

రాయపర్తి: హిందీ పండిట్ సునీతను సత్కరిస్తున్న టీచర్లు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED HOSPITAL STAFF

★LAB TECHNICIANS-BOYS, ★PHARMACY BOYS (మందుల షాపు) ★OT BOYS కావలెను. సంప్ర : Guardian Hospital, Mulugu 'X' Road, Warangal. 12 to 2 PM. NTW-0427

★Walk in Interview for Assistant Security Officer, Security for CCTV Monitoring. Cont: 7337313271, 9949499959 NTW-000

★Doctor/Gynaecologist (DGO/MS), X-Ray Technician, Lab Technicians, PRO's, Staff Nurses, Receptionist to work in Multispeciality Hospital in Madikonda, Hanamkonda. Cell: 9951020366 NTW-000

PLOT FOR SALE

★హన్మకొండ KITS కాలేజీ, అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గర్లో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 9553255936 NTW-326316

★క్లియర్ టైటిల్ (45W X 54D) వెస్ట్ ఫేస్, LRS & బోర్ సౌకర్యం కలిగిన KUDA ప్లాట్ అమ్మబడును. KU బైపాస్ 100 ఫీట్ రోడ్‌కు 100 మీటర్ల దూరంలో, రెడ్డి కాలనీ, హన్మకొండ. 9348489945. NT-332518

CHANGE OF NAME

I, ABDUL MASOOD MOHD Date of Birth 10-06-1970 (New Name) previously called ABDUL MASOOD D.O.B.: 10-06-1968 (Old Name) and Residing at H.No 15-2-368, Rangampeta, Warangal District-506 007, Telangana, ndia,, and solembly declare,

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455. NTW-318996

EDUCATION



★గీజుబాయ్ సెట్విన్ వారి PPTTC దసరా ట్రైనింగ్ ప్రోగ్రాం ప్లే వే మెథడ్ బోధన, అక్టోబర్-2 నుండి ప్రారంభం. ట్రైనింగ్‌కి హాజరై SETWIN ద్వారా సర్టిఫికెట్ & ఉద్యోగం పొందండి. సెల్: 7382733795, 9491818630, HNK. NTW-14951

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565